
జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 24 జూన్ 2024
www.ntnews.com


## అశ్వత్థామ చిరంజీవః



**భూమ్మీద** సప్త చిరంజీవుల్లో అశ్వత్థామ ఒకడు. మహాభారత ఇతిహాసంలో ఆయన పాత్ర అద్భుతం. వీరుడు, శూరుడు, పుట్టుకతో వరాన్ని పొందిన ధీరుడు. కౌరవ, పాండవుల గురువు ద్రోణాచార్యుడు, కృపి సంతానం ఈయన. పుట్టే సమయంలో అందరిలా ఏడవకుండా గుర్రంలా సకిలించినందుకు ఈ పేరు పెట్టారని కథ. అశ్వత్థామ శివుడి వరప్రసాదం. పుట్టుకతోనే అతని నుదుటిపై ఓ మణితో జన్మించాడు. అది అతనికి మృత్యువు సహా అన్ని రకాల బాధల నుంచి రక్షణనిస్తుంది. అలా ద్రోణపుత్రుడు చిరంజీవి అయ్యాడు. అశ్వత్థామ తండ్రి శిక్షణలో కౌరవ, పాండవులతోపాటే విద్య నేర్చుకున్నాడు. అర్జునుడికి సాటి వచ్చే విలుకాడిగా రాటుదేలాడు. అర్జునుడితోపాటే బ్రహ్మాస్త్ర ప్రయోగాన్నీ సాధించాడు. అయితే ఇతనిది దుడుకు స్వభావం. అస్త్ర ప్రయోగం అత్యవసరమైతే తప్ప చేయకూడదన్న తండ్రి మాటలను అశ్వత్థామ చెవికెక్కించుకోలేదు. ఇక దుర్యోధనుడితో స్నేహం చేసిన అశ్వత్థామ కురుక్షేత్ర యుద్ధంలో కౌరవుల తరపున పోరాటం చేశాడు. యుద్ధంలో తండ్రి మరణం తట్టుకోలేక పాండవుల మీదికి శక్తిమంతమైన నారాయణాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అయితే అది ఆయుధాలు ఉన్నవారినే తప్ప నిరాయుధులను దండించదు. శ్రీకృష్ణుడి సలహాతో పాండవ వీరులంతా తమ ఆయుధాలను వదిలేస్తారు. అలా పాండవులు యుద్ధంలో ఓటమిని తప్పించుకుంటారు. ఇక భారత యుద్ధం పూర్తయిన తర్వాత కూడా అశ్వత్థామ తన స్నేహితుడు దుర్యోధనుడి కోసం ఏదో ఒకటి చేయాలనుకుంటాడు. ఓ రాత్రివేళ పాండవుల శిబిరం మీద దాడిచేస్తాడు. పొరపాటుగా పాండవ పుత్రులైన ఉపపాండవులను సంహరిస్తాడు. ఉదయం జరిగింది తెలుసుకున్న పాండవులు ఆగ్రహోదగ్రులు అవుతారు. జరిగినదానికి అశ్వత్థామ కారకుడని తెలుసుకుంటారు. అతణ్ని వేదవ్యాసుడి ఆశ్రమంలో పట్టుకుంటారు. అశ్వత్థామ, పాండవులకు మళ్లీ యుద్ధం మొదలవుతుంది. దీంతో అశ్వత్థామ అర్జునుడి కోడలు గర్భిణిగా ఉన్న ఉత్తర మీదికి బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాడు. నష్టం జరగకముందే శ్రీకృష్ణుడు జోక్యం చేసుకుంటాడు. ఉత్తరను కాపాడతాడు. చిరంజీవి అయిన అశ్వత్థామను కుష్ఠువ్యాధితో రోజులు వెళ్లదీయమని శపిస్తాడు. గర్భంలో ఉన్న శిశువును చంపే ప్రయత్నం చేసినందుకు కృష్ణుడి శాపభారాన్ని మోస్తూ అశ్వత్థామ కుష్ఠువ్యాధితో బాధపడుతూ ఇప్పటికీ జీవించి ఉన్నాడని పురాణ కథనం.

# ధేనుక వధ-కాళియ కథ



మన పోతన మధురిమ 176 వ భాగం



**శు**కముని పరీక్షిత్తుతో... రాజా! వసుదేవ తనయులు పశుపాలనం చేసే కాననం– అడవిలో ఒక తాళ (తాటిచెట్ల) వనం ఉంది. అందులో బాగా పండి కింద రాలిపడ్డ తాటి పండ్ల వాసనలు గోపబాలుర నాసా(ముక్కు) రంధ్రాలలో చొరబడి మనస్సులను అలజడి పరుస్తూ ఉండేవి. అయితే, ఆ వనాన్ని ఖర (గాడిద) రూపంలో ఉండే ఊర్జా (శక్తి)వంతుడైన ధేనుకుడు అనే పేరుగల దానవుడు దర్జాగా కబ్జా చేసి కూర్చున్నాడు. ఎంతటి పర– గొప్ప వీరుడైనా వనంలోకి చొరబడటానికి వెరచి వెనకడుగు వేసేవాడు. ఒకనాడు శ్రీదాముడనే గోపాలకుని సూచనమేరకు వాసుదేవాగ్రజుడు బలరాముడు రౌద్రాకారం ధరించి ఆ రాసభా(గాడిద)సురుని నాలుగు కాళ్లు ఒక్కచేతితో కలిపి ఒడిసిపట్టి, గిరగిర తిప్పి, ఒక తాటి చెట్టుకేసి విసరికొట్టి వాణ్ని మట్టి కరిపించాడు.

**ఉ॥'తంతువులందు జేలము విధంబున నే పరమేశు మూర్తి యం**
**దింతయు బుట్టునట్టి జగదీశు డనంతుడు దైత్య మాత్రుని**
**ట్లంతము సేయు టెంత పని? యద్భుతమే వినుమంతలోన వా**
**డంతము బొందు టెల్లగని యాతని బంధులు గార్దభంబులై'**

రాజా! పడుగు– పేకల దారపు పోగులు మూల పదార్థమై ఉండగా వాటి ఆధారంగా చేలం– వస్త్రం అల్లబడుతోంది. అలాగే, పరమేశ్వరుని రూపం ఈ జగత్తుకు మూలంకాగా, ఈ సృష్టి– జడ చేతనాత్మక సంఘాతమంతా అతనియందు ఓతప్రోతమై– నిండి నిబిడీకృతమై ఉంది. అట్టి సర్వభూత మహేశ్వరుడు, అనంతుడు ఒక అసురుని అంతం గావించడం ఏమి వింత? గార్దభాసురుడు చచ్చాడని విని నొచ్చుకొని వాని చుట్టాలంతా కచ్చకట్టి గాడిద రూపాలలో వచ్చి తమపై మూకుమ్మడిగా దాడి చేయగా జగజ్జెట్టీలు రామకృష్ణులు మునుపటిలాగానే వారినందరినీ మట్టుపెట్టారు. 'ధేనుక హర భక్త కామధేనువు గలుగన్'– ధేనుకాసురుని సంహరించిన దీనజనావనుడు– దీనరక్షకుడు భక్తుల పాలిట కామధేనువై వెలసి ఉండగా వారి మనసులోని కామనలు– కోరికలు తీరకుండా ఉంటాయా?

బ్రహ్మానంద రసాన్ని ఆస్వాదించడంలో ప్రథమ ప్రతిబంధకం (అడ్డు) దేహాధ్యాస– దేహాభిమానం. 'దేహమే నేను' అన్న విపరీత భావన– అనాత్మ దేహాన్ని ఆత్మగా భావించడం. 'దేహాధ్యాసో హి ధేనుకః'– ఆ దేహాధ్యాసే ధేనుకాసురడని వల్లభాచార్యుల వ్యాఖ్య. జన్మజన్మల నుండే జీవుణ్ని అనుసరిస్తూ వస్తున్న అహంకారం. ఇది తొలగిపోవాలంటే దృఢ వైరాగ్యం, దానితోపాటు చిరకాల అభ్యాసం కూడా చాల అవసరం. 'అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే'– గీతాశాస్త్రం. 'అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః' అని పతంజలి యోగ శాస్త్రం. గీతాచార్యుడు అభ్యాసాన్ని కూడా ఒక యోగంగా సెలవిచ్చాడు– 'అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనుంజయ' (అభ్యాస యోగం ద్వారా నన్ను పొందుటకు ప్రయత్నించు). ఈ అభ్యాస యోగానికి ఆచార్యుడు (అనంతశ్చాస్మి నాగానాం– గీత) అనంతుడు, ఆదిశేషుడు– బలరామస్వామి. శ్రీకృష్ణ భగవానుని విభూతి. అందుకే బలరాముని చేతనే 'ధేనుక వధ' అని కథ. దేహాధ్యాస నశిస్తే 'తాల'ఫలం అనగా 'తార'ఫలం (వ్యాకరణ రీత్యా ర– ల లకు అభేదం)– తారకం, అనగా ప్రణవ (ఓంకార) ఫలం మోక్షం సులభం. ఇదే 'ధేనుకాసుర వధ' లీలా పరమార్థం! సారహీనములని తెలిసి కూడా మూఢుడు దీనంగా గాఢమైన విషయ వ్యామోహంలో బద్ధుడవుతాడు. అట్టివాడు 'నరో నాసౌ స గర్దభః'– నరుడు కాడు గాడిద అని యోగ వాశిష్ఠ వచనం మారు మోగుతోంది.


 'న తేషు రమతే బుధః'– వివేకవంతుడు విషయ భోగాలలో రమించడు. రమించు వాడు మూఢుడు, విరమించు వాడు పండితుడు. ధేనుకాసుర పీడ విరగడైన శుభ గడియలలో సురులు– దేవతలు విరుల (పూల) వానలు కురిపించి, దుందుభులు మొరయిం (మోగిం)చారు.

రాజా! ఒకనాడు బలరాముడు తోడు రాకుండానే ఘనశ్యాముడు గోపాలకుల కూడి గోవులను తోలుకుంటూ అడవికి వెళాడు. ఎందుకని? రోహిణీ సూతి (బిడ్డ) బలరాముడు, కాళియుడు ఇద్దరూ సర్ప జాతి వారే కదా! కాళియుని దర్పం అణచి యమునా జల శోధనం– శుద్ధి చేయ సంకల్పించాడు కనుక వాడి మర్దనం చూచి అన్న రామన్న బాధపడతాడేమోనని జనార్దనుడు– కృష్ణుడు ఒంటరిగా వెళ్లాడు. అడవిలో ఎండ వేడికి తాళలేక గోవులు, గోపాలకులు దాహంతో తపించి సొమ్మసిల్లి పోయారు. వారంతా యమునా నది మడుగులోని విషపూరితమైన జలం తాగి మరణించారు. వారిజాక్షుడు హరి తన కరుణ అనే అమృత వర్షం కురిపించి వారినందరినీ బ్రతికించాడు. బాలకృష్ణుడు కాలానికి కూడ కాలం కదా! ఇలాగని శుకముని పలుకగా విని అవనీపతి పరీక్షిత్తు వినయంగా ఇలా అర్థించాడు...

**క॥'తొల్లుల గాచిన నందుని**
**కుఱ్ఱని చరితామృతంబు గొనకొని చెవులన్**
**జుఱ్ఱంగ దనివి గల్గునె!**
**వెఱ్ఱుల కయినను దలంప? విప్రవరేణ్యా!'**

–'బ్రహ్మవేత్తలలో ఉత్తముడవైన యోగిసత్తమా! తొర్రుల– గోవులను గాచిన నందరాజు కుర్రని– కుమారుని (బాలగోపాలుని) ఉదార కథ అనే సుధారసాన్ని సదా చెవులతో ముదా– ఆనందంగా జుర్రుతుంటే ఎలాంటి వెర్రివానికైనా తనివి తీరదు కదా! కందర్పజనకుడు కృష్ణుడు ఆ సర్పరాజు దర్పాన్ని ఎలా హరించాడో, కనికరించి నాకు వివరించి చెప్పండి.' అప్పుడు శుకుడు ఇలా పలకనారంభించాడు... (మన పోతన భాగవతంలో ఇలా ద్విత్వ– ద్విరుక్త రేఫ (ఱ్ఱ) వంటి కఠిన ప్రాసతో భాసిస్తూ కుంద కుసుమాల– మల్లెలు, మొల్లల వలె అర్థ గాంభీర్యాన్ని, శబ్ద సౌందర్యాన్ని గుబాళిస్తూ ఉండే కంద పద్యాలు కోకొల్లలు.) రాజా! ఆ మడుగు ఒడ్డున ఒక పెద్ద కడిమి చెట్టు ఉంది. సర్వశరణ్యుడు, వేద స్వరూపుడు అయిన దామోదరుడు కృష్ణుడు, పూర్వపుణ్య విశేషం చేత తన పావన పాద స్పర్శకు నోచుకొన్న ఆ పాదపాన్ని– చెట్టును ఎక్కాడు. నడుముకు ఉన్న దట్టిని గట్టిగా లాగి చుట్టుకొని, తల వెంట్రుకలను నెమలి పింఛంతో బిగించి కట్టుకొని, భుజాలు చరచి, రెండు పాదాలూ గట్టిగా ఊదిపట్టి జగజెట్టి అయిన ఆ నందుని పట్టి (బిడ్డ) చెట్టు కొమ్మమీద నుంచి కుప్పించి మడుగులోకి దూకాడు. అప్పుడు ఆ మడుగులోనుంచి గభీలుమని పెద్ద చప్పుడు పుట్టి నిశ్శబ్దంగా ఉన్న వాతావరణంలో మారుమోగింది.

**శా॥'పాలీనాకృతి దోయరాశి నడుమన్ భాసిల్లి మున్నాడ్యుడై**
**కాళిన్య క్రియ నీదు నేర్పు దనకుం గల్మిన్ భుజగేంద్ర హృ**
**త్పీఠాగ్రంబున రోష వహ్నులెగయన్ భీమంబుగా నీదె న**
**ల్లోలోత్తుంగ తరంగమై మడుగు దుర్లోక్యంబుగా బాహులన్'**

రాజా! మీనావతారంలో సాగర మధ్యంలో ఈదుతూ నానా విధాల విహరించడం దీనావను– దీనరక్షకునికి ముందుగానే బాగా అలవాటు– అనుభవం కదా! మడుగులోని నీరు అల్లకల్లోలమై ఉవ్వెత్తున అలలు ఎగసిపడే తీరున, నల్లనయ్య చేతులతో కలచివేస్తూ అతిదారుణంగా ఈదసాగాడు. ఆ దృశ్యం దుర్లోక్యం– చూడ శక్యం కానిది. కాళియ నాగేంద్రుని గుండెల్లో బాగా రోషాగ్ని జ్వాలలు చెలరేగాయి. వాడు పోటుగాని వలె విజృంభించి నందపట్టి ఆయువుపట్టులలో కాటువేసి, పొడుగాటి తన ఒడలి (శరీరం)తో పాలకడలి శయనుని– కృష్ణుని గట్టిగా పెనవేసి కట్టిపడేశాడు. పైకి ఎత్తిపెట్టిన వాని పడగల ముఖాల నుంచి ప్రఖర (తీక్ష్ణ) విషాగ్నిజ్వాలలు మెరుస్తూ కురుస్తున్నాయి. నిశ్చేష్టుడై పడి ఉన్నట్లు ఉన్న తమ ప్రాణసఖుడు కన్నయ్యను చూసి, అతని ప్రభావం తెలియని అమాయకులైన గోపకులు ఆర్తనాదాలు చేస్తూ తూలి పడిపోయారు. అక్కడ ఉన్న ఆవులు, ఆబోతులు, లేగలు అన్నీ వగ(దుఃఖం)తో మేతలు మానేసి, చేతలుడిగి, కాతర (తత్తర) పడ్డాయి. రాజా! భూతలం కంపించినట్లయింది. గోపకులు, వ్రేతలు (గోపికలు) దుశ్శకునాలు చూసి భయపడి వ్రాతలు (గుంపులు)గా, బలరామునితో సహా ఆబాలగోపాలం మడుగు వద్దకు చేరారు. పెనుబాము పడగలచే చుట్టబడి సొమ్మసిల్లి పడి ఉన్న బుడతడిని– శ్యాముని చూసి గోకులవాసులందరూ దుఃఖం ఆపుకోలేక వాపోయారు. వారంతా అజ్ఞానం వల్ల అలా విలపిస్తున్నారని బలభద్రుడు నవ్వుతూ ఊరుకున్నాడు. నాగారి (గరుడ) వాహనుడు శ్రీహరి శక్తియుక్తులను అవ్వారి– అపరిమితం, అడ్డులేనివిగా ఎరిగిన వాడైనా వారిని నివారించలేదు. నంద యశోదలు కుందుతూ– శోకిస్తూ ఇలా ఆక్రందించారు...



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

**క॥'విషకుచ యుగయగు రక్కసి**
**విషకుచ దుగ్ధంబు ద్రావి విష విజయుడవై**
**విషరుహలోచన! యద్భుత**
**విషయుండగు నీకు సర్ప విషమెక్కె గదా!'**

కన్నా! చిన్ననాడే విషపూరితమైన పూతన చన్నులు కుడిచి విషాన్ని జయించిన అసమాన అమృతమూర్తివే! విషరుహలోచనా– అంబుజనేత్రా! అద్భుత లీలా వైదుష్య (పాండిత్య) విశేషాలు చూపిన నీకు ఈనాడు ఈపాడు పాపరేడు (నాగరాజు) విషం ఎక్కిందంటే ఇంతకన్నా ఆశ్చర్యం కలిగించే విషయం ఏముంది?

**క॥'పన్నగము మమ్ము గఱవక**
**నిన్నేటికి గరచె గుఱ్ఱ! నెమ్మి గలిగి నీ**
**వున్నను మము రక్షింతువు**
**నిన్నున్ రక్షింప నేము నేరము తండ్రీ!'**

అన్నా! ఈ పాపిష్టి పన్నగం మమ్ములను కరవకుండా నిన్నెందుకు కరిచింది రా! నీవు క్షేమంగా ఉంటే మమ్ములను రక్షిస్తావు. నీవే ఆపదపాలైతే నిన్ను మేము కాపాడలేము గదా తండ్రీ!

(సశేషం)

గీతావాక్యం

# పెద్దల ఆచరణే సమాజానికి దిక్సూచి

**యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే!**

(భగవద్గీత 3-21)

ఈ ప్రపంచంలో గొప్పవారిగా గుర్తింపుపొందిన వారు ఏయే కర్మలను ఆచరిస్తారో.. ఎలా ప్రవర్తిస్తారో, దానినే సాధారణ ప్రజానీకం కూడా అనుసరిస్తారు. ఆ పెద్దలు దేనిని ప్రమాణంగా తీసుకుంటారో.. తక్కిన వారు కూడా దానినే ప్రామాణికంగా తీసుకుంటారు. ఇక్కడ.. 'తత్ తత్ ఏవ' అనే పదం వాడారు. అంటే.. అది మాత్రమే.. అని అర్థం. అలాగే.. 'ఆచరతి' ఆచరించడం.. మాటలు చెప్పడమే కాదు.. చెప్పినది ఆచరణలో చూపడం అవసరం. ఆచరించని బోధలకు విలువలేదు. ధార్మికమైనదానినే ఆలోచించడం, ఆలోచించినదే చెప్పడం, చెప్పిందే ఆచరించడం.. దీనినే త్రికరణశుద్ధి అంటారు.

ఇంటిపెద్ద ఆచరణయోగ్యమైన కర్మలను ఆచరిస్తూ.. ధర్మబద్ధమైన జీవనాన్ని గడిపితే.. ఆ కుటుంబసభ్యులంతా ఆ మార్గంలోనే నడుస్తారు. తల్లిదండ్రులు సమయ పాలకులైతే పిల్లలకూ అదే అలవడుతుంది. సాధారణంగా పిల్లలు చెప్తే నేర్చుకోరు.. అనుసరించి నేర్చుకుంటారు. కాబట్టి తల్లిదండ్రుల ప్రవర్తన పిల్లల సమగ్రజీవన వికాసంపై ప్రభావాన్ని చూపుతుంది. జీవితాన్ని ఏ కర్మాచరణ ఉద్ధరిస్తుందో, ఆ కర్మను ఆచరించడం మంచిది. ఆ కర్మాచరణ వల్ల నాకేమి వస్తుందనే భావన కన్నా, దానివల్ల సమాజానికి ఏ సందేశాన్ని ఇస్తున్నామనేదే ముఖ్యమైనది. ఒక కుటుంబంలో యజమాని ఎంత బాధ్యతతో నడుచుకోవాలో.. దేశంలో ప్రజాపాలకులు కూడా అంతే నిబద్ధతతో వ్యవహరించాలి. సంస్థలో యజమాని నీతి నిజాయతీలతో పనిచేస్తూ, నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తిని సాధిస్తే.. ఉద్యోగులు అందరూ అదే ఒరవడిని ఆశ్రయిస్తారు. ఆ ధార్మికతే సంస్థ సంస్కృతిగా ఆదరణ పొందుతుంది.



ప్రపంచం సక్రమ మార్గంలో నడవాలి అంటే.. సంపద సృష్టి జరగాలి. ప్రజలకు జీవనోపాధి కల్పించాలి. అభ్యుదయం కావాలి.. సంక్షేమం అవసరం. సాంఘిక వ్యవస్థ, పౌరధర్మాలు ఆచరణలో ఉండాలి. ఇవన్నీ పాలకులు, నాయకుల ఆచరణలో వెలుగుచూస్తేనే సమాజంలోనూ ప్రతిబింబిస్తాయి. పాలక వ్యవస్థ స్వార్థపరతను ఆశ్రయిస్తే సాధారణ ప్రజానీకం బతుకులు దుర్భరం అవుతాయి. వ్యక్తి శ్రేయస్సు కన్నా లోక శ్రేయస్సునే ప్రాధాన్యత అంశంగా భావిస్తూ పాలకులు, విశ్వశ్రేయస్సు కోసం పాటుపడటం కర్తవ్యంగా భావించాలి. అందులో వారికి మోక్షం వచ్చినా రాకపోయినా నష్టమేమీ లేదు! కానీ, లోకోపకారం జరగనివేళ ప్రపంచమే నిర్వీర్యమవుతుంది.

మానసిక శాస్త్రజ్ఞులు.. పిల్లల పెంపకాన్ని గురించి చెబుతూ.. తల్లిదండ్రుల ఆచరణలో 'క్షమ, సహనం, ఓర్పు' లాంటివి ఉంటే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పెరుగుతారంటారు. అవగాహనా పూర్ణ వాతావరణంలో పెరిగిన పిల్లలలో న్యాయంచేసే గుణం ఉంటుందని చెబుతారు. పెద్దవారి మధ్య ప్రేమ, అనురాగం, ఓదార్పు, నిజాయతి, ప్రోత్సాహం ఉండి ఒకరినొకరు గౌరవించుకుంటే.. ఆయా లక్షణాలు పిల్లలకు అలవడుతాయి. అలాగే.. విమర్శలు, అనుమానం, అభద్రతాభావన, అవమానం.. లాంటివి ఉంటే.. పిల్లలూ అవే వైఖరులను అలవరచుకుంటారు. సమాజమైనా.. ఇల్లయినా దానిని నడిపే పెద్దల ప్రవర్తన.. ఆచరణలకు దర్పణంగా నిలుస్తుంది. సమాజాన్ని అభ్యుదయం వైపు నడిపేవారే శ్రేష్ఠులుగా గుర్తింపు పొందుతారు. వారి మార్గమే సమాజానికి శ్రీరామరక్ష.

... పాలకుర్తి రామమూర్తి

# బ్రహ్మ పూజకు వేళాయె

సందర్భం

**శివపూజకు** కార్తిక మాసం ప్రాధాన్యం. మహావిష్ణువు అర్చనకు మార్గశిరం విశేషం. జ్యేష్ఠ మాసం శివకేశవులతోపాటు బ్రహ్మదేవుడి పూజకూ ప్రశస్తమని పురాణాలు చెబుతున్నాయి. ఎందుకంటే జ్యేష్ఠం బ్రహ్మకు ప్రీతికరం. కాబట్టి, ఈ నెలలో బ్రహ్మను కూడా అర్చించాలని చెబుతారు. మరి కలియుగంలో బ్రహ్మకు ఆలయాలూ, అర్చనలూ లేవు కదా! అయినా ఈ నెలలో ఇంటి పూజా మందిరంలో బ్రహ్మ అర్చన చేయవచ్చని శాస్త్ర వచనం. బియ్యపుపిండితో గానీ, గోధుమపిండితో గానీ బ్రహ్మదేవుడి మూర్తిని సిద్ధం చేసుకోవాలి. నెలంతా నిత్యం షోడశ ఉపచారాలతో బ్రహ్మను పూజించి, నివేదనలు అర్పించాలి. ఇలా చేసినవారికి ఇహలోకంలో శుభాలు సిద్ధిస్తాయనీ, ఆపై సూర్యలోక నివాసం లభిస్తుందనీ పెద్దలు వివరించారు. అయితే తార్కికంగా ఆలోచిస్తే ఇందులోని అంతరార్థం అవగతమవుతుంది. బ్రహ్మ నాలుగు ముఖాలు కలవాడు. వాటితో నాలుగు వేదాలనూ గానం చేసినవాడు. వేదం అంటే తత్వం, తపస్సు, యోగం, సత్యం! తత్వచింతనతో కాలం గడపడం తత్వం. మనసును, ఇంద్రియాలను ఏకాగ్రం చేసుకోవడం తపస్సు, అలా ఏకాగ్రమైన మనసును దైవానికి చేరువ చేయడం యోగం, దానికి ఫలితం సత్యం. ఇక్కడ సత్యం అంటే అబద్ధాలు ఆడకపోవడం, నిజాలు చెప్పడం మాత్రమే కాదు. యథార్థాన్ని గుర్తించి రుజుమార్గంలో పయనించడమే సత్యం. ఈ నాలుగు అలవర్చుకోవడమే బ్రహ్మదేవుడి అర్చన. ఇక సూర్యలోక నివాసం అంటే... మనసులో చీకటి అనే అజ్ఞానాన్ని తొలగించి, వెలుగులు నింపుకోవడం. ఏ జీవన విధానాన్ని మనం అనుసరిస్తే, జ్ఞానం లభిస్తుందో దానిని బ్రహ్మదేవుడి అర్చనగా పెద్దలు సూచించారు. అంటే జ్ఞాన పూర్వకమైన కర్మాచరణ చేయాలన్నమాట!



... శ్రీచరణ్

# భారం కాదు బాధ్యత

ఇస్లాం బోధ

**వితంతువులు** అంటే సమాజంలో చిన్నచూపు. ఒంటరి మహిళలు, వితంతువులు ఈ లోకంలో ఎదుర్కొంటున్న పరిస్థితులను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇంట్లో, పని ప్రదేశాల్లో పలురకాల హింసకు గురవుతూ ఉంటారు. భర్త పోయిన మహిళను అపశకునంగా భావించే కుసంస్కారం సమాజంలో వేళ్లూనుకుని ఉంది. భర్తపోయిన సోదరిని ఆదరించడానికి బదులు భారంగా భావించే సోదరులు మన లోకంలో కోకొల్లలు. మూడు పదులు నిండకుండానే భర్తను కోల్పోయిన వనితకు మళ్లీ పెండ్లి చేయాలంటే చాలామంది తల్లిదండ్రులు వెనకాముందు ఆలోచిస్తుంటారు. వితంతువుగా మారిన కోడలిపట్ల అత్తామామలు ఎంత నిర్దయగా వ్యవహరిస్తారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వీలైనంత త్వరగా కోడల్ని వదిలించుకోవాలని భావిస్తారు.



ప్రవక్త మహనీయుల కాలంలో ఇలాంటి విపరీతాలను ఆయన తీవ్రంగా ఖండించేవారు. వితంతువుల పునర్వివాహాన్ని ఆయన ప్రోత్సహించారు. వితంతు పోషణను అత్యున్నత పుణ్యకార్యమని ప్రవక్త (స) ప్రబోధించారు. 'అనాథ పిల్లల, ఏ అండాలేని వితంతు మహిళల పోషణ భారం చూసేవారు అల్లాహ్‌కు ప్రీతిపాత్రులు' అన్నారు ప్రవక్త (స). భర్తలేని యువతులకు మరో వివాహం చేయడం తల్లిదండ్రుల బాధ్యత అని ప్రవక్త స్పష్టం చేశారు. ప్రవక్త కాలంలో యుద్ధాల్లో అనేకమంది సైనికులు హతమయ్యేవారు. పెద్ద సంఖ్యలో వితంతువులు, అనాథలు సమాజంలో మిగిలేవారు. ఈ వితంతువులు, అనాథలను కాపాడే పద్ధతుల్లో వారి పునర్వివాహం ఒకటి. ఈ క్రమంలో ప్రవక్త (స) వితంతువులైన నిస్సహాయ మహిళలను వివాహం చేసుకుని ఆశ్రయమిచ్చారు. చట్టబద్ధమైన వివాహాల ద్వారా వారికి పునరావాసం కల్పించారు. యుద్ధాల్లో బందీలైన మహిళలు, వితంతువులు వారి పిల్లలకు భద్రత, పునరావాసం కల్పించి, వారు ఆకలిదప్పులతో అలమటించకుండా, వారి జీవితాలు మోడుబారిపోకుండా ఆదుకున్నారు. ప్రవక్త (స) కానీ, ఆయన అనుచరులు కాని యుద్ధఖైదీలుగా వచ్చిన ఈ మహిళలను, వితంతువులను తమ బానిసలుగా చేసుకోలేదు, గౌరవప్రదంగా వివాహం చేసుకున్నారు. వారికి గౌరవప్రదమైన హోదా ఇచ్చారు. ఈ వితంతువులు, వారి అనాథ పిల్లల సమస్యకు చక్కటి పరిష్కారాన్ని సూచించారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

# గురువు ఔదార్యం

జెన్ కథామృతం

**ఒకానొక** బౌద్ధాశ్రమంలో ఒక గురువు ఉండేవాడు. ఆరామంలో పదుల సంఖ్యలో విద్యార్థులు ఉంటుండేవారు. గురువు రోజూ వారికి పాఠాలు బోధిస్తూ, విద్యార్థులతో తోటపని చేయిస్తూ ఉండేవాడు. ఓ రోజు ఆరామంలో దొంగతనం జరిగింది. అక్కడే చదువుకుంటున్న ఓ విద్యార్థి దొంగతనం చేసినట్టు రుజువైంది. మిగతా విద్యార్థులంతా గురువుతో అతణ్ని ఆశ్రమం నుంచి పంపించి వేయాల్సిందిగా కోరారు! గురువు మౌనంగానే కుదరదు అన్నట్టుగా సంజ్ఞ చేశాడు. విద్యార్థులు నిరాశగా తమ గదుల్లోకి వెళ్లిపోయారు. కొన్ని రోజుల తర్వాత ఆశ్రమంలో మరోసారి దొంగతనం జరిగింది. గతంలో చోరీకి పాల్పడిన విద్యార్థే మళ్లీ దోషిగా తేలాడు. విద్యార్థులు ఈసారి గురువుతో 'అతణ్ని ఆశ్రమం నుంచి వెళ్లగొట్టాల్సిందే!' అని తీవ్రస్వరంతో చెప్పారు. అయినా గురువు స్పందించలేదు. మర్నాడు విద్యార్థులంతా గురువుకు ఒక లేఖ రాశారు. దొంగతనానికి పాల్పడుతున్న విద్యార్థిని ఆశ్రమం నుంచి తొలగించకపోతే.. తామంతా వెళ్లిపోతామని ఆ లేఖ సారాంశం. గురువు దాన్ని చదివి విద్యార్థులతో.. 'మీరంతా తెలివైన వారు. ఏది మంచో, ఏది చెడో తెలిసినవారు. ఎక్కడికి వెళ్లినా బతకగలరు. కానీ, ఆ కుర్రాడు అమాయకుడు. తప్పుదారిలో పయనిస్తున్నాడు. నా అవసరం మీకన్నా అతనికే ఎక్కువ ఉంది. కాబట్టి అతను ఇక్కడే ఉంటాడు. ఇక్కడ ఉండటం కష్టంగా ఉంటే మీరంతా ఆశ్రమం నుంచి బయల్దేరొచ్చు' అన్నాడు. గురువు ఔదార్యానికి శిష్యులు ఆశ్చర్యపోయారు. అలాంటి గురువు నీడలో ఉండటమే తమకు శ్రేయస్కరం అని భావించారు. దొంగతనానికి పాల్పడుతున్న విద్యార్థిని తమలో చేర్చుకున్నారు.

